THE WORD OF TRUTH

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'స త్య వా ణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలో మేము ముద్రించబోవునట్టి పుస్తకములను, సత్యవాక్కు మాస పత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYAVANI**
(P.O. Box 80) Seshagiri Rao St.,
KAKINADA - 533 004

గమనిక :— మీరు M. O. పంపునప్పుడుగాని, మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడుగాని మీ సత్యవాక్కు నంబరును దయచేసి తెలియ చేయండి.

Razan Electric Press, Kakinada

# సత్యవాక్కు
## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* — J. C. CHOATE

*Managing Editor* — JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **11** — జూన్ **1982** — సంపుటి **2**


## సంపాదకీయము

### హితబోధ మరియు పవిత్ర జీవనము

### *(Sound Doctrine and Pure Living)*

లేఖకుడైన లూకా యేసునుగూర్చి చెబుతు ఆయన చేయుటకును, బోధించుటకును ఆరంభించెను అని అపొ. కా. 1:2లో పలికెను. అనగా ఆయన తన జీవితంలో మొదటిగా దేవుని కొరకు జీవించుట యనగా యేమిటో నిరూపించెను. తరువాత తండ్రిచిత్తమును యితరులకు బోధించుట కారంభించెను. తత్ఫలితముగా ఆయన బోధ బహు శక్తివంతమైనదాయెను. ఈరీతిగా ఆయన ప్రజల గౌరవమును సంపాదించెను. మరియు వారికి బోధించి దేవుని ప్రభావమునకు వారిని ఆకర్షించ గలిగెను.

మన కాలంలో నైతికముగా మంచి జీవితాన్ని జీవించుచున్నవారున్నారు గాని వారు క్రీస్తు బోధకు ఇంకా లోబడినవారు కాదు. తండ్రియైన దేవునికి క్రీస్తుచేసిన ప్రార్థనలో ఆయన యిట్లు

పలికెను: "సత్యమునందు వారిని ప్రతిష్టచేయుము; నీవాక్యమే సత్యము" (యోహాను 17:17). అది అపొస్తలుల బోధను సూచించు చున్నది (అపొ. కా. 2:42). ప్రభువు చిత్తమును బోధించుటకుగాను అపొస్తలులు దైవప్రేరితులైరి. మనము వారి బోధ ననుసరించుటలో ప్రభువునే అనుసరింతుము. అది పవిత్రభక్తియై యున్నది; హితబోధ ననుసరించుటలో కలుగు క్రీస్తుమార్గమది (యాకోబు 1:27).

లేఖనములలో తెలియపరచబడిన హితబోధకు మనము లోబడ వలెను. మనము దేవునియందును, క్రీస్తునందు ఆయన దేవుని కుమారు డనియు విశ్వాసముంచవలెను. విశ్వాసములేకుండ దేవుని కిష్టుడై యుండుట అసాధ్యమని హెబ్రీ పత్రిక లేఖకుడు చెప్పుచున్నాడు (హెబ్రీ 11:6). మనము దేవుని యందును, క్రీస్తునందును విశ్వాస ముంచవలెనని ఆయన మనలను హెచ్చరించుచున్నాడు (యోహాను 14:1). ఆవిశ్వాసముపై ఆధారపడి మనము ప్రభువుకు లోబడవలెను. మనము రక్షింపబడు నిమిత్తము మనము విశ్వసించి బాప్తిస్మము పొందవలెనని క్రీస్తు చెప్పుచున్నాడు (మార్కు 16:16). దానిని మనము హృదయపూర్వకముగా చేయవలెనని పౌలు చెప్పుచున్నాడు (రోమా 6:17, 18). క్రీస్తు తనకు విధేయులైన వారి రక్షణకు కారకు డాయెను (హెబ్రీ 5:8, 9). తరువాత మనము ఆ బోధలో నిలిచి యుండవలెను, దానిలో కొనసాగుచు యుండవలెను. అపొ. యోహాను ఇట్లనుచున్నాడు: "క్రీస్తుబోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహాను:9).

చివరిగా, మనము హితబోధను బోధించవలెను. క్రీస్తు ఇట్లు ఆజ్ఞాపించెను: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" (మార్కు 16:15) యౌవన సువార్తికుడైన తిమోతిని పౌలు ఇట్లు హెచ్చరించెను: "వాక్యమును ప్రకటించుము; సమయ మందును అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘ

శాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధిచెప్పుము” (2 తిమోతి 4:2). అతడు మరల యిట్లనెను: “నీవు అనేక సాక్షుల యెదుట నావలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము” (2తిమోతి2:2). “నీవు హితబోధకు అనుకూలమైన సంగతులను బోధించుము” అని అతడు తీతును హెచ్చరించెను (తీతు 2:1).

ఇప్పుడు దీని నంతటిని సంగ్రహింతము. దేవుడు తన వాక్యమును సత్యమును మనకిచ్చెను. అది అంతయు ఆయన ప్రేరితమే. మనము ఏవిధముగనైన దానికి కలుపకూడదు, దానినుండి తీసివేయకూడదు, దానికి బదులు వేరొకదానిని యుంచరాదు, మానవుని ప్రతి సత్కార్యమునకు అది సంసిద్ధుని చేయును, గనుక మనము వాక్యప్రకారము నడచువారై యుండవలెను. రక్షింపబడు నిమిత్తము మనము సువార్తకు, దేవుని ఆజ్ఞలకు, సత్యమునకు లోబడవలెను. అటుతరువాత ఆపవిత్ర వర్తమానమును మనచుట్టు నున్నవారందరికి, మానవ జాతియంతటికి అందించవలెను.

మనము రక్షింపబడి, ఈవర్తమానమును యితరులకు అందియ్యవలెనంటే మనమెవరమో ఏమైయున్నామో, అట్లగుట కేమిచేసామో తెలిసికొనాలి. మనము సువార్తను, సంఘమును, దేవుడు కోరే ఆరాధనను, జీవితవిధానమును తెలిసికొనవలెను. ఏదైనా అనుమానమున్నయెడల దేవుని వాక్యమును సరిగ అర్థము చేసికొనేవరకు దానిని మనము చదువవలెను. దానిని విశ్వసించిదానికి లోబడవలెను. మనము నిజముగా సత్యమును ఎరిగి దానికి విధేయత చూపినవారమైనయెడల దానిని మనమెట్లు పొగొట్టుకొనగలము? ఈ లోకమందున్న ధనమంతయు ఇచ్చినకూడ దానినుండి మనము మార్పు చేయబడము. అయిననుకూడ ఒకొక్కసారి మన సోదర సోదరీలకు ఏదోసమస్యవచ్చి సంఘమునకు వచ్చుట మానివేయుదురు. ఏదో ఒక డినామినేషన్ వార

పెద్దజీతం ఇచ్చెదమని చెప్పగానే కొన్నిసార్లు ఒక్కొక బోధకుడు అట్లు ఈడ్చుకుపోబడును. ఆదిలో వారు అసలు మార్పుచెందితే అట్లెందుకు పడిపోదురు? అట్లుచేయువారు ప్రభువును నిరాకరించి, సాతానును వెంబడించుటకు ఖచ్చితముగా నిశ్చయించుకొన్నవారు. ఎంత విచార కరమో! అట్టివ్యక్తి విశాలమార్గములో నడచుచు యున్నయెడల అది నాశనమునకు నడుపును. అయితే క్రీస్తు బోధ సరిగ ఉపదేశింపబడాలి, ఒకడు దేవుని చిత్తాన్ని పూర్తిగ గ్రహించుకొనాలి, అతడు తన హృదయపూర్వకముగా నమ్మి అప్పుడుమాత్రమే అతడు విధేయత చూపాలని మనము జాగ్రత్త వహించాలి. ఒకడు గ్రహించుకొని ఎప్పుడులోబడాలనేది ఆప్రత్యేక వ్యక్తికి చెందిన విషయము. అయితే ఉపదేశకులమైన మనము చేయు బోధనుగూర్చి కడుజాగ్రత్త వహించాలి. ఆ వ్యక్తి విధేయత జూపిన తరువాత అతడు ప్రభువునందు పెరిగి, ఆయనకు నమ్మకముగా యుండునట్లు అతనికి దేవుని వాక్యము ఉపదేశింప బడుచు యుండాలి.

అయితే మనము గమనించవలసిన ఇంకో విషయమున్నది. అది పవిత్ర జీవనమనునది. ఒకడు సత్యమును ఎరుగవచ్చు, దానికి లోబడ వచ్చు, దానిని బోధింపవచ్చు గాని ఆవ్యక్తి భక్తిగల జీవితమును జీవించనియెడల అతడు నశించుటయేగాక అతని వేషధారణ వలన ఇతరులుకూడా నాశనమగుటకు కారకుడగును. ఇలాచేసేవారు చాల మంది ఉన్నారు. వారు చెప్పుదురేగాని చేయరు. ప్రభువుకొరకు జీవించుచున్నామని వారు నటింతురు. వారు యితరులకు బోధించు నప్పుడు నిరాకరింపబడుదురు. నేను క్రైస్తవుడను, బోధకుడను అని చెప్పు కొనినంత మాత్రాన యితరులు నిన్ను గౌరవించరు. నీవు మార్చ బడిన వాడవని, క్రీస్తును వెంబడించుచున్నావని నీజీవితాన్ని బట్టి నిరూపించవలెను. కొంతకాలానికి ప్రజలు నిన్ను గుర్తింతురు. నీవునిజముగా క్రీస్తుకొరకు జీవించుచున్నావని వారు గమనించి నిన్ను గౌరవింతురు,

నీవు చెప్పేబోధను ఆలకింతురు, అయితే చాలమంది స్థానికబోధకులు కేవలము వేషధారులని ప్రజలు చాలకాలమునుండి ఎరిగియున్నందున వారు స్థానికముగా గౌరవము సంపాదించుకోలేక పోవుచున్నారు, వీరు వేషధారులు, స్వలాభముకొరకు బోధించువారు, దానిలోనికి దీనిలోనికి తరుచు మార్చబడేవారని స్థానిక ప్రజలు ఎరిగినందున వారు గౌరవింపబడరు. నీవట్టివాడవుకావని నీజీవిత విధానమునుబట్టి ప్రజలకు చూపించినయెడల వారు నిన్నుగూర్చి తమ అభిప్రాయమును మార్చుకొందురు. దీనికి కొంత సమయము పట్టును. అందియ్యడానికి నీ దగ్గర ఒక వర్తమాన ముండవచ్చును. గాని దానిని బలముగా అందియ్యడానికి ముందు దానిని బట్టి నీవు జీవించవలసి యున్నది.

పవిత్ర జీవనమును గూర్చి మరికొంత ఆలోచింతము. క్రీస్తుకు లోబడుటలో ప్రభువు మనలను రక్షించును, మన పాపములు క్షమించును (మత్తయి 26:28), మన ఆత్మలను పవిత్రపరచును (1 పేతురు 1:22). మరియు తన సంఘముతో చేర్చును (అపొ. కా. 2:47). అందువలన మనము ప్రత్యేకమైన జనమై యున్నాము (1 పేతురు 2:9). మన పురాతన జీవితమునే జీవించుచు యుంటే సువార్తకు అసలు ఎందుకు లోబడితిమి? గాని మన మిప్పుడు క్రైస్తవులమై యున్నాము. క్రీస్తును వెంబడించుటద్వారా దానిని చూపించ వలెను. మనమేరకమైన ప్రజలుగా యుందుమో యని కనుగొనుటకు ఈ లోకము కనిపెట్టుచున్నది. వారి జీవితముకంటె క్రైస్తవ జీవితము శ్రేష్ఠమైనదని మనము చూపించకపోతే వారు ఎన్నడు క్రైస్తవులు కాజాలరు. మనలో తేడా ఏమియు లేనియెడల క్రైస్తవు లగుటకు వారెందుకు ప్రయత్నించాలి?

ప్రభువు మనలను రక్షించి పవిత్ర పరచినందున మనము పవిత్రముగానే యుండాలి. మనము పవిత్ర మనస్సాక్షిని కలిగి యుండాలి. చేయకూడని దేదీ మనం చేయకూడదు. మన హృదయాన్ని

పవిత్రంగా యుంచుకోవాలి (1 పేతురు 1:22). తన హృదయాలోచన లనుబట్టి మానవుడు పనిచేయునని బైబిలు బోధించుచున్నది. "హృదయ శుద్ధిగలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు" అని యేసు చెప్పెను (మత్త 5:8). మన మాటలలో పరిశుద్ధత యుండాలి. అబద్ధము లాడు టకు, బూతులాడుటకు, పనికిమాలిన సంగతులు పలుకుటకు మన నాలుకను ఉపయోగించ రాదు. "పరపక్షమం దుండువాడు మనలను గూర్చి చెడుమాట యేదియు చెప్పనేరక సిగ్గుపడునట్లు ... నీ ఉప దేశము మోసము లేనిదిగాను, మాన్యమైనదిగాను, నిరాక్షేపణామైన హితవాక్యముతో కూడినదిగాను ఉండవలెనని" పౌలు చెప్పెను (తీతు 2:8). మనము చెప్పు చేయుదాని యంతటిలోను మంచిమాదిరి నెలకొల్పవలెను. పౌలు తిమోతికి యిట్లు వ్రాసెను: "నీ యౌవన మునుబట్టి ఎవడును నిన్ను తృణీకరింప నియ్యకుముగాని మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను విశ్వాసులకు మాదిరిగా ఉండుము" (1 తిమో 4:12). "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి" యని క్రీస్తు చెప్పెను (మత్త 5:16). మనము క్రీస్తు అడుగు జాడలలో నడవవలెను (1 పేతురు 2:21). మరణ పర్యంతము నమ్మకముగా యుండవలెను (ప్రకటన 2:10).

భక్తిగల పవిత్ర జీవనమువలన అనేక సంగతులు సాధ్యమగును. సహజముగా మనము పాపములేనివారుగ జీవించలేముగాని అట్లుండు టకు తప్పక ప్రయత్నించ వలెను. మనము ఎంత ప్రయత్నించినను కూడ తప్పులో పడుచు యుందుము గాని మన శక్తికొలది ప్రయత్నిం చాలని ప్రభువు కోరుచున్నాడు. ఆయనకొరకు మనము జీవించాలని, ఆయనను సేవించాలని, ఆయన కోరలాగున మన ముండాలని మన శాయశక్తులా ప్రయత్నించాలని ఆయన కోరుచున్నాడు. మన మట్లు

చేసినప్పు డాయనకు అంగీకార యోగ్యముగా ఆరాధన చేయఁగలము. "దేవుడు ఆత్మ గనుక ఆయన నారాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని" క్రీస్తు చెప్పెను (యోహాను 4:24). ఆయన మన ప్రార్థనలకు జవాబిచ్చును. అపొ. యోహాను ఇట్లనుచున్నాడు: "ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మన మేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే" (1 యోహాను 5 : 14). ఇందు విషయమై మనము ఆయన బిడ్డలమై యుండాలని, ఆయన వాక్యప్రకారము జీవించాలని, ఆయన చిత్తప్రకారం ప్రార్థించాలని ప్రభువు కోరుచున్నాడు. పాపియైనవాడు తిరుగుబాటుదారుడు, అవిధేయుడు ఇష్టుడుకాడు. గనుక తమ జీవితములో దేవుని యెవరు ఘనపరతురో వారినే ప్రభువు దీవించును. మనము క్రీస్తు రక్తమువలన కప్పబడియున్నాము. మరల యోహాను ఇట్లనుచున్నాడు: "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచినయెడల మనము అన్యోన్యసహవాసముగల వారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతిపాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). పవిత్రజీవనమువలన అపనమ్మకముగా యున్న వారిని పునరుద్ధరించగలము. నీతిమంతుని ప్రార్థన బలముగలదై యుండునని యాకోబు మనకు గుర్తుచేయుచున్నాడు (యాకోబు 5:16). నమ్మకమైన క్రైస్తవ జీవనమువలన యితరులనుండి గౌరవము లభించును. పౌలు ఇట్లనుచున్నాడు: "నిన్ను గూర్చియు నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము, వీటిలో నిలకడగా ఉండుము; నీవీలాగు చేసి నిన్నును నీబోధ వినువారిని రక్షించుకొందువు" (1తిమో 4:16). పవిత్ర జీవనమువలన సాధించగలిగేది ఎంతో యున్నది. వాటన్నిటిలో ప్రాముఖ్యమైనది నిత్యజీవము. ప్రకటన 22:14లో మనము ఇట్లు చదువగలము. "జీవవృక్షమునకు హక్కుగలవారై గుమ్మములగుండ ఆ పట్ట

ణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు".

చివరిగా, ప్రభువుకోరునట్టి ప్రజలుగా మనముండబోవుచున్న యెడల, యితరులను క్రీస్తునొద్దకు నడిపించ బోవుచున్నయెడల మనము సత్యమును కలిగి యుండుట, పవిత్రజీవితాన్ని జీవించుట అత్యవసరము, ఒకటిఉండి ఇంకొకటి లేనియెడల అంతావ్యర్థమే, వేషధారణమే. హితబోధ, పవిత్రజీవనము ఉన్నయెడల అది ప్రభువుకు యిష్టపూర్వకమైనదియేగాక యితరులకు క్రీస్తు సువార్తనందించే శక్తిగల సాధనముకూడాను. నశించుచున్నవారిని క్రీస్తుదరికి నడిపించుటలో యిది మనకొక గొప్ప సహాయము. మనతండ్రియైన దేవుడు దానికి తక్కువైన దేనినీ అంగీకరించడు.

---

## రక్షింపబడుటకు సంఘ సభ్యుడు కావలెనా?

## *(Must one be a member of the Church to be Saved?)*

(గత సంచిక తరువాయి) —పెర్రి కోతమ్

### క్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను

ఒకే ఒక్క శరీరమున్నదని బైబిలు బోధించుచున్నది: "అవయవములు అనేకములైనను శరీరమొక్కటే" (1కొరింథి 12:21). "శరీర మొక్కటే..."(ఎఫెసీ 4:4). గనుక ప్రతివాడు సువార్తకు లోబడవలెను. ప్రభువుచే రక్షింపబడి ఆయన సంఘముతో చేర్చబడవలెను. అప్పుడతడు ఆయనతో సంపూర్ణుడగును.

ఒకడు క్రీస్తునందు సంపూర్ణుడగును గనుక మానవ కల్పిత మత సంస్థలలో సభ్యుడుగా యుండుటవలన కలిగే లాభము ఏదియులేదు. ఆత్మీయ ఆశీర్వాదములన్నియు క్రీస్తునందున్నవి. క్రొత్త నిబంధన

నాచరించువా డెవడును ప్రభువు సంఘసభ్యుడుగాను, క్రైస్తవునిగాను మాత్రమే తప్ప మరొకవిధముగా యుండలేదు. ప్రజలు క్రైస్తవులుగా, క్రీస్తు శరీర సభ్యులుగా మాత్రమే యుండుటకు సంతృప్తిజెంది డినామినేషన్లనుండి దూరముగా యుండవలెను (1 కొరింథీ 1:10-13; యోహాను 17:20, 21; ఎఫెసీ 4:1-6). ఈరోజుల్లో నేను క్రైస్తవుడను అని ఒకడు చెప్పినను, నీవు ఏసంఘ సభ్యుడవు? లేక ఏ డినామినేషన్‌తో నీకు పొందిక యున్నది? అనే ప్రశ్నను కొందరు అడుగుచుందురు. మతశాఖలతో సంబంధములేని బైబిలు సంఘము యొక్క ఉపదేశమునుండి తొలగిపోయినట్లు ఇది నిరూపించుచున్నది. ఏలయనగా సువార్తకు నాపు విధేయత రక్షించును, ప్రభువు సంఘముతో మాత్రమే చేర్చును.

సంగ్రహముగా, సంఘమనగా ఈలోకమునుండి సువార్త ద్వారా పిలువబడిన వారని బైబిలు బోధించుచున్నది. దానిపై క్రీస్తు శిరస్సుగా యేలును, మరియు దానిలో ఆయన ఆత్మ నివసించును. రక్షింపబడినవారు, సంఘముకూడ ఒక్కటే. రక్షింపబడినవారే సంఘము. మరియు క్రైస్తవుడగుటకు ఒకడు క్రీస్తు శరీరములో సభ్యుడై యుండవలెను. పరిశుద్ధలేఖనముల ప్రకారము క్రీస్తు నిర్మించిన సంఘమునకు వెలుపల ఒకడు రక్షింపబడగలిగితే అతడు క్రీస్తు లేకుండనే రక్షింపబడ వచ్చునని నిర్ధారణ అయినది. ఇది సాధ్యము కాదని బైబిలు బోధించుచున్నందున, ఒకడు ప్రభువు సంఘసభ్యుడు కాకుండా రక్షింపబడనేరడు (అపొ. కా. 4:12, 2 తిమో 2:10).

## అనేకులు నశింతురా ?

క్రొత్త నిబంధనలో తేటగాయున్న ఈబోధనుగూర్చి చెప్పునరికి, "చాలా ఎక్కువమంది నశింతురన్నమాట" యని అనేకులు పలుకుదురు. తప్పకుండ అది సత్యమే (మత్తయి 7:13-14). ఇదే అభ్యంతరమును నోవహు చేసిన బోధనుగూర్చికూడ వారు చెప్పవచ్చును గాని

జలప్రళయమునుండి రక్షింపబడవలెనన్న ఒకడు ఓడలో నుండవలసి వచ్చెను. రక్షింపబడుటకు ఓడలో ప్రవేశించుట అవుసరమని అనేకులు ఆనాడు తలంచలేదు. కేవలము ఎనిమిదిమంది మాత్రమే నాశనమునుండి తప్పించుకొనిరి. దేవుడు ఒకని రక్షించవలెనంటే ఓడకు వెలుపల రక్షించలేడా? యని నోవహును కొందరు అడిగి యుండవచ్చును. ఆయన రక్షింపగలడని మన మంగీకరించినను ఆయన ఏమి చేయగలడు అనేది గాక ఆయన ఏమి వాగ్దానము చేసెననునది ప్రశ్న. పాపమునుండి రక్షణనుగూర్చి అదే విధమైన పరిస్థితి ఇప్పుడున్నది. సీయోనులో, సంఘములో ప్రభువు రక్షణనుంచెను; అది ఆయన శరీరము (యెషయా 46:13; హెబ్రీ 12:22, 23). క్రీస్తునకు వెలుపల యున్నవారు పాపములో నశింతురు (ఎఫెసీ 2:12). పాపులలో ప్రధానుడగు తానున్నవాడైన సౌలును, సత్పురుషుడగు కొర్నేలియుకూడ రక్షణ ననుభవించుటకు క్రీస్తులోనికి లేక సంఘములోనికి ప్రవేశింపవలసి వచ్చెను (అపొ. కా. 9:1-22; 1 తిమొ 1:15; అపొ. కా. 10; 11:1-18). ఈ రెండు విపరీత పరిస్థితుల మధ్య యున్న వాడెవడైనను క్రీస్తులోను లేక ఆయన సంఘమగు శరీరములోను రక్షింపబడును.

## క్రీస్తులోనికి ప్రవేశించుట ఎట్లు?

క్రీస్తులో యుండుటను గూర్చిన ప్రాముఖ్యతను గ్రహించిన తరువాత, ఆయన లోనికి ప్రవేశించుట యెట్లో బైబిలు వివరించుచున్నదా? అవును. ఒక ప్రత్యేక సంఘటనద్వారా క్రీస్తులోనికి ప్రత్యేక ప్రవేశము కలదు. క్రీస్తులోనికి ప్రవేశించుటద్వారా ఒకడు దేవుని రక్షణ నుపయోగించుకొనవలెను. మానవులను క్రీస్తులోనికి తీసికొనివచ్చు దైవమార్గము బాప్తిస్మమని బైబిలు వక్కాణించుచున్నది: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" (రోమా 6:3). "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించు

కొని యున్నారు" (గలతీ 3:27). ప్రజలు "క్రీస్తులోనికి" బాప్తిస్మము పొందియున్నారని బైబిలు రెండుసార్లు ప్రకటించుచున్నది. గనుక ఒకడు క్రీస్తులోనికి ఇట్లు ప్రవేశించును. అంతే కాకుండా ఆయన శరీరములో అనగా సంఘములో ప్రవేశించే మార్గము బాప్తిస్మమని బైబిలు చెప్పుచున్నది. "మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథి 12:13).

లేఖనములలో ఇయ్యబడిన రీతిగా ఆఒక్క ఆత్మయొక్క ఉపదేశమును వెంబడించుటద్వారా ప్రజలందరు ఒక్క శరీరములోనికి అనగా సంఘములోనికి బాప్తిస్మము పొందుదురు. బాప్తిస్మము పొందిన విశ్వాసులందరు క్రీస్తు సంఘమైయున్నారు. మరియు ఒకడు బాప్తిస్మము పొందేవరకు అతడు క్రీస్తులోను లేక ఆయన సంఘములోను ఉండనేరడు. గనుక క్రీస్తులోను, ఆయన శరీరమయిన సంఘములోను ఒకని ప్రవేశింపజేయు క్రియయగు బాప్తిస్మము అతని రక్షించే విధేయత చూపించు క్రియయై యున్నది. రక్షణ క్రీస్తులో యున్నది. మరియు ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును గనుక అతడు బాప్తిస్మము పొందేవరకు రక్షింపబడలేడు. ఇంకొక మాటలో రక్షణ పొందవలెనంటే ఒకడు బాప్తిస్మము పొందవలెను. (మార్కు 16:16; అపొ. కా. 2 : 38; 22 : 16; 1 పేతురు 3 : 21). క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన మారుమనస్సు పొందిన విశ్వాసులు మాత్రమే క్రీస్తు సంఘసభ్యులు. ఈ దిగువ దానిని ఇప్పుడు గమనించుము :

1. విమోచన క్రీస్తులో యున్నది (ఎఫెసీ 1:7).
2. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును (గలతీ 3:27).
3. గనుక విమోచింప బడుటకు ఒకడు బాప్తిస్మము పొందవలెను.

అయితే ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించక ముందు అతడు మొదట క్రీస్తునొద్దకు రావలెను. గనుక విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు

ఒకని క్రీస్తు నొద్దకు తెచ్చునని బైబిలు బోధించుచున్నది (హెబ్రీ 11 : 6; రోమా 10 : 10; అపొ. కా. 11:18; 1 తిమో 6:12-13). యొద్దకు, లోనికి అను మాటలలో భేదమున్నది. ఉదా:—ఒకడొక ఇంటి యొద్దకు వచ్చి, తరువాత ఇంటిలో ప్రవేశించును. అప్పుడతడు ఇంటిలో యుండును. ఒకడు ఇంటిలో యుండక ముందు అతడు మొదట దానిలో ప్రవేశించవలెను. అందుకే ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెనని బైబిలు చెప్పుచున్నది.

ఒకడు క్రీస్తులోగాని లేక ఆయనకు వెలుపలగాని యున్నాడు (రోమా 16:7). బాప్తిస్మము పొందనివాడు క్రీస్తుకు వెలుపల ఉన్న వాడు గనుక క్రీస్తునందున్న ఏ ఒక్క ఆశీర్వాదమును పొంద నేరడు. గాని క్రీస్తులోనికి ముంచబడినవాడు ఆయనలో యున్నవాడు గనుక ఆయనయందున్న ఆత్మీయాశీర్వాదము లన్నిటిని పొందగలడు. ఒకడు బాప్తిస్మముద్వారా క్రీస్తులో ప్రవేశించినపుడే అతడు రక్షణపొందును, ఆయన శరీరమైన సంఘముతో చేర్చబడును.

## ముగింపు

క్రీస్తునకు వెలుపల యెవడును రక్షింపబడుట, క్షమించబడుట, లేక దేవునితో సమాధాన పరచబడుట అసాధ్యము. సంఘములో లేకుండా యెవడును రక్షింపబడడు; ఏల యనగా రక్షణ క్రీస్తు శరీర మయిన సంఘమునకు వెలుపల గాక దానిలోపల యున్నది. ఒకడు రక్షించబడిన యెడల అతడు సంఘములో యుండును; అతడు సంఘ ములో యున్న యెడల అతడు తన గత పాపముల నుండి రక్షింపబడి యున్నాడు. అందువలననే సంఘ సభ్యత్వము యొక్కయు పాప క్షమాపణ యొక్కయు షరతులు ఒక్కటే. రక్షింప బడినవారే సంఘము గనుక, రక్షింపబడుటకు ఒకడు దాని సభ్యుడు కావలెను. ఒకడు క్రీస్తు శరీరమయిన సంఘము వెలుపల రక్షింపబడ గలిగిన యెడల, అతడు క్రీస్తుకు వెలుపల రక్షింపబడగలడు. అయితే రక్షణ

క్రీస్తులో యున్నది గనుక అది అసాధ్యమని బైబిలు చెప్పుచున్నది. గనుక ప్రభువు సంఘమునకు వెలుపల ఒకడు రక్షింపబడి క్రైస్తవుడుగా యుండ లేడు.

ఆత్మీయాశీర్వాదము లన్నియు క్రీస్తునందే కలవని గుర్తించి జనులందరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటకు ఆశించవలెను. వారు క్రీస్తునందు నమ్మకముగా జీవించి ప్రభువునందు మృతి జెందవలెను. బైబిలులో కొంత భాగమునే అంగీకరించి నేను క్షేమముగా యున్నా ననుకొని మిగిలిన భాగమును తిరస్కరించుట ఎంతో ఘోరమైనది. అట్లే క్రీస్తునకు వెలుపల మృతి జెంది నిత్యము నశించుటకూడ ఎంతో ఘోరమైనది.

(సమాప్తము)

---

## యేసును వెంబడించిన పండ్రెండుగురు-3

# యాకోబు

## సద్దణపబడిన ఉరిమెడివాడు

## *(James the Thunderer Silenced)*

రాజైన హేరోదు యోహాను సహోదరుడైన యాకోబును ఖడ్గముతో చంపించెను (అపొ. కా. 12:2). ఈ ఘోరకృత్యము ద్వారా ఉరిమెడు వారిలో ఒకనిని అతడు సద్దణిపెను. యాకోబుకు బోయనేర్గెసను ఈ పేరు ఎక్కడి నుండివచ్చినది? అది అతనిగూర్చి మన కేమి తెలియజేయుచున్నది? తనకు సన్నిహితంగాయున్న శిష్యులకు యేసు మారు పేరు లిచ్చుటకద్దు. అవి వారి తత్వాన్ని సహజంగా వర్ణించేవి. సీమోనుకు ఆయన పేతురు (కేఫా) అనిపేరు పెట్టెను (యోహాను

1:42) ఆయన యాకోబు యోహానులకు బోయనేర్గసను పేరుపెట్టెను. బోయనేర్గసు అనగా ఉరిమెడి వారని అర్థము (మార్కు 3:17). యేసును చేర్చుకొనుటకు వెనుదీసిన సమరయుల గ్రామముపైకి ఆకాశమునుండి అగ్నిదిగి నాశనముచేయునట్లు ఆజ్ఞాపింప తలంచిన వీరికి యేసుపెట్టిన వర్ణనాత్మక నామము సరియైనదే (లూకా 9:52-54). ఈబోయనెర్గసులు బహుశ మందేగుణము గలవారు, తృటికాలములో నిర్ణయాలను గైకొనే వారు, నేస్థులను వెంటనే శిక్షించే తత్వముగలవారు. అయితే ఉరిమెడి వారయిన యాకోబును హేరోదు తన ఖడ్గధారవలన నిశ్శబ్ద పరచెను.

## శిష్యులలో యాకోబు

మన ప్రభువు యాకోబును పిలిచినప్పుడు అతడంత నాజూకైన వాడుకాదు, ఏమంత "క్రైస్తవుని" వలె లేడు. గాని ఒక లక్షణము మాత్రం అతనిలో కళ్ళకెదురుగా కనబడేది. అతడు చురుకైనవాడు, సమర్పితుడు. బండగుణా లేమైనాయుంటే ప్రభువు వాటిని నునుపు చేయగలడు. ఆయన యాకోబును నునుపుచేసెను. ఉదాసీనులకు, సోమరులకు వేరుగా యాకోబులో వాగ్దానపూరిత జీవితం కనబడెను. యాకోబు పిలువబడినప్పుడు అతడు తన తండ్రియైన జెబెదయితోను సహోదరుడైన యోహానుతోను కలసి చేపలుపట్టు తన కుటుంబ వృత్తిలో నిమగ్నుడైయుండెను (మత్తయి 4:21). బహుశ అతడు బాప్తిస్మమిచ్చు యోహాను శిష్యుడై యుండవచ్చును (యోహాను 1:35). గాని ఏదయినను యేసు అతని పిలిచినప్పుడు వెంటనే అతడాయనను వెంబడించెను. పేతురు యోహానులతో అతడు మన ప్రభువునకు ప్రియుడాయెను. యాయీరు కుమార్తె బ్రదికింప బడినప్పుడు వారాయన వెంబడివెళ్ళిరి (మార్కు 5:37). యేసు రూపాంతరము పొందినప్పుడు వారాయనతో యుండిరి (మత్తయి 17:2). మరల గెత్సేమనే తోటలో పేతురు యాకోబు యోహానులను ఆయన వెంటబెట్టుకొని

వెళ్ళి ప్రార్థించెను (మార్కు 14:33). యాకోబు యోహానులిద్దరిని గూర్చి చెప్పునప్పుడు సాధారణంగా యాకోబు పేరు ముందు మనకు కనబడును (మత్తయి 17:1). మిగిలిన యిద్దరినిగూర్చి కంటే యాకోబును గూర్చి మనకు తెలిసింది తక్కువే. ఏలయనగా అతడు అకాలముగా హతమార్చబడెను. అతడు లిఖించినదేదియు లేదు.

## హతసాక్షి వర్తమానము

బహుశలిఖితపత్రములకంటె శక్తివంతమైనవర్తమానమును యాకోబుమన కిచ్చియున్నాడు. క్రీస్తును గూర్చిన అతని సాక్ష్యానికి కాగితకలములు కాదుగాని అతని ప్రాణమే అవుసరమాయెను. "నేను భూమి మీదనుండి పైకెత్తబడిన యెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందునని" యేసు చెప్పెను (యోహాను 12:32). ఆయన సిలువ దానిని సాధించెనను వాస్తవము చరిత్రలో ఆశ్చర్యకరముగా నిగూఢమై యున్నది. శాపగ్రస్థమైన సిలువ మానవుల కాశ్చర్య చకితమయ్యింది, ఆయన మరణం దేవుని ప్రేమను చాటుటలో యితరులు భౌతిక సంబంధబాంధవ్యముల నధిగమించి సాక్ష్యమిచ్చుటకు దోహదమిచ్చింది. స్తెఫను మొట్టమొదటి హతసాక్షి ఆయెను (అపొ. కా. 22:20). అతని తరువాత కొద్ది సంవత్సరములలో యాకోబు అతనిని వెంబడించెను. ఆ విధముగా క్రీస్తుకు తమ ప్రాణములతో సాక్ష్య మిచ్చిన వారి పెద్ద వరుస ఆరంభ మాయెను. తరువాత హతసాక్షులు తమ చుట్టు గొప్ప సాక్షి సమూహము మేఘమువలె ఆవరించి యున్నట్లు భావించిరి. యేసువైపు చూచుచు వారు పట్టుదలతో మరణమును ఎదుర్కొనిరి. కడు వృద్ధుడైన పోలికార్పుకు యేసును నిరాకరించడమో లేక మరణించడమో ఎంచుకొన వలసిందనగా అతడు "ఎనభైయారు సంవత్సరముల మట్టుకు నేనాయన సేవకుడను. ఆయన నాకెట్టి దోషము చేయలేదు. నన్ను రక్షించిన నా రాజును నే నిప్పుడు

దూషించగలనా ?" అని చెప్పి సంతోషముతో క్రీస్తు కొరకు మరణించెను.

యాకోబు అత్యాసక్తిపరుడు, చురుకైనవాడు గనుక అతడు హతసాక్షి యగుట తేలికకాదు. రాజ్యములో కుడి ఎడమ ప్రక్కల స్థానములను యాకోబు యోహానులు కోరిరి. వారు శక్తిని ఘనతను ఆశించిరి గాని యేసు వారికి మరణమును ప్రసాదించెను: "నేను పొందుచున్న బాప్తిస్మము మీరు పొందెదరు" (మార్కు 10:39). యాకోబు మహిమ పొందెను గాని అతడు మొదట ఆశించిన విధముగా మాత్రము కాదు. "తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని రక్షించుకొనును" అని తన యజమాని చెప్పిన మాటల భావమును చివరిగా అతడు గ్రహించుకొనెను. ఉరిమెడివాడు సద్దణపబడెను గాని యేసుక్రీస్తు సువార్త ఎక్కడ రాజ్యము చేయునో అక్కడ ప్రజల హృదయాల్లో అతడు నివసించును.

"తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును, నా నిమిత్తమై తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని రక్షించుకొనును" అని యేసు చెప్పెను (లూకా 9:24).

—థామస్. H. O.

---

## అసూయ - ఒక భయంకర పాపము

### *(Envy A deadly Sin)*

ఎవరికైనా అదృష్టము కలిసివస్తే నీవు సంతోషించెదవా? ఉద్యోగములో నీకంటె ముందుగా ఎవరికైనా ప్రమోషన్ వస్తే నీవు

సంతోషించెదవా? నీవు చేసినదానికి నీకు మెప్పు రాకపోయినను యిత రులు చేసిన దానికి వారికి మెప్పువస్తే నీవు సంతోషించెదవా? యిట్టి పరిస్థితుల్లో చాలసార్లు మనం సంతోషముగా యుండుట ఎంతో కష్టముగా యుండును. దానికంతటికి కారణము_అసూయ. ఇతరులకు కలిగిన మేలులు ఆస్థి మొదలైనవాటిని గూర్చిన అసంతృప్తి, దుస్వభావములే అసూయయని నిఘంటువు పరంగా మనం చెప్పుకోవచ్చును. తాను కోరేది మరొకడు కలిగి యున్నప్పుడు కలిగే నిరసనభావం అసూయ.

అసూయ సర్వసామాన్యమైన ఒక సమస్య. అది భౌగోళిక సరిహద్దులనేమీ ఎరుగదు. అది యౌవనులలోను, వృద్ధులలోను, ధనవంతులలోను, దరిద్రులలోను, ఉపదేశకునిలోను, విద్యార్థిలోను కనబడును. అసూయనుండి విడుదలపొందిన వాడెవడు మనకు కనబడక పోయినను, ఈ పాపాన్ని కనుగొనడం అంత సులభమయిన పనికాదు. ఎందుకంటే, ఒక నేరస్థుడు తన రూపురేఖలను కప్పిపుచ్చులాగున అసూయ అనేక నామకరణములను ధరిస్తాది. అనేకమైన యితర పాపముల వెనుక అది తన్ను తాను మరుగుపరచుకొంటాది. ఈభూమిపైనను, నిత్యత్వములోను మనసంతోషాన్ని నాశనం చేయుటకు సాతానుడు వినియోగించే అతిప్రమాదకరమైన పనిముట్టు అది.

ఈలోకములో మొట్టమొదటి నరహత్యకు కారణం అసూయే. ఏలయనగా అసూయనుబట్టియే కయీను తన తమ్ముడైన హేబెలును హత్యచేసెను (ఆది 4:1-8). అసూయవలన యోసేపు సహోదరులు అతనిని బానిసగా అమ్మివేసిరి (ఆది 37). దేవుడు మోషే అహరోనుల కిచ్చిన ప్రముఖస్థానములను గూర్చి కోరహు దాతను అబీరాములు అసూయజెంది తిరుగుబాటు చేసిరి. దేవుడు ఆముగ్గురినీ వారి అనుచరులగు రెండువందల యాభైమందినీ నాశనము చేసెను (సంఖ్యా 16). ఈప్రపంచ చరిత్రయంతటిలోను అతిఘోరమైన పాపకృత్యమును,

దేవుని కుమారుడైన యేసుక్రీస్తును సిలువ వేయించుటలోయున్న పాపములలో అసూయ ఒకటి. పిలాతు యేసును విడుదల చేయగోరెను "ఏలయనగా వారు అసూయచేత ఆయనను అప్పగించిరని అతడు ఎరిగి యుండెను" (మత్తయి 27:18).

అసూయ మన జీవితమును నెమ్మదిగా కొరికివేయునట్టి రోగము వంటిది. అది మితిమీరిపోయేవరకు అనేకసార్లు అది కనబడకయుండును. "సాత్వికమైన మనస్సు శరీరమునకు జీవము. మత్సరము ఎముకలకు కుళ్ళు" (సామె 14:30). "అయితే మీహృదయములలో సహింపనలవికాని మత్సరమును వివాదమును ఉంచుకొనిన వారైతే అతిశయపడవద్దు, సత్యమునకు విరోధముగా అబద్ధమాడవద్దు. ఈజ్ఞానము పైనుండి దిగివచ్చినదికాక భూసంబంధమైనదియు ప్రకృతి సంబంధమైనదియు దయ్యముల జ్ఞానమువంటిదియునై యున్నది. ఏలయనగా మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతి నీచ కార్యమును ఉండును" (యాకోబు 3:14-16).

మత్సరముతో బాటు మిళితమైయున్న మరికొన్ని ఇతర పాపములను గమనించుము. కొంతమంది అన్యజనులు సమస్తమైన దుర్నీతి చేతను దుష్టత్వముచేతను లోభముచేతను ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము నరహత్య కలహము కపటవైరమను వాటితో నిండిన వారై యుండిరని పౌలు చెప్పెను (రోమా 1:29). అందువలన "అల్లరితో కూడిన ఆటపాటలైనను మత్తయినను లేకయు, కాముకవిలాసములైనను పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను మత్సరమైనను లేకయు పగటియందు నడుచుకొన్నట్టు మర్యాదగా నడుచుకొందము" అని పౌలు మరల చెప్పుచున్నాడు (రోమా 13:13).

యితరులకు అదృష్టము లభించినప్పుడు మన మెట్లు ప్రవర్తించాలి? యితరులు దీవించబడినప్పుడు క్రైస్తవుడు నిజముగా ఉల్లసించు స్వభావము కలిగి యుండాలి. అనేకసార్లు యితరుల సాధక

బాధకములను వినుటకు వారి ఆపదలలో సహాయ పడుటకు మనము సులభముగా సంసిద్ధు లగుదుము. గాని వారి సంతోషములో నిజంగా పాలు పొందుటకు, వారిని ప్రోత్సహించుటకు మనకు చాల కష్టతర ముగా యుండును.

మన తోటివారిని గూర్చి యథార్థమైన ప్రేమ సుహృద్భావము లతో మనము నిండి యుండాలి. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమిం చుట యనునది పాత నిబంధనలో రెండవ ప్రాముఖ్యమైన ఆజ్ఞ యని యేసు చెప్పెను (మత్తయి 22:37-40). ప్రేమ మత్సర పడదు అని పౌలు వ్రాసెను (1 కొరింథీ 13:4). యితరులకు మేలు కలుగగా మనము సంతోషించాలి. వారు దీవించబడుచున్నందున కృతజ్ఞత చెల్లించాలి. మనమట్లు చేసిన యెడల మనము సంతోషముగా యుండుటయే గాక మన దేవుని సంతోషపెట్టినవార మగుదుము.

—రానీ లోవే (IGT)

---

## మీ వెలుగును ప్రకాశింపనీయుండి!

### *(Let your Light Shine !)*

ఒకనాడు యాత్రికుడొకడు ఓఫ్రించి గ్రామానికి వచ్చాడు. చీకటి పడుతూయుంది, ప్రజలేమో వీధులగుండా తొందరగా నడచు కుంటూ వెళ్లుచున్నారు. అయితే ప్రతివాడు వెలిగింపబడిన ఒక లాంతరును పట్టుకొని వెళ్లుచున్నట్లు ఆయాత్రికుడు గమనించాడు. దీనిని గూర్చి అతడు అడుగగా అతనికీవిధంగా జవాబీయబడింది: "ఈ ప్రజలు తమ గ్రామములోని ఆరాధన మందిరానికి వెళ్లుచున్నారు. ఆమందిరం నిర్మించబడినప్పుడు ప్రతి సంఘసభ్యుడు తన సొంత లాంతరును వెలిగించి రాత్రిపూట ఆరాధనలకు తీసికొనిరావలెననే ఒప్పందము

జరిగింది. ఆ మందిరాన్ని వెలిగించే విధానము ఇంకొక టేమీ లేదు. గనుక తాను ఆరాధనకు వెళ్ళకపోతే ఆ మందిరంలో చీకటిగాయుండు నని ప్రతివానికి తెలుసు".

ఆయాత్రికుడు అప్పుడాగ్రామ ఆరాధన మందిరానికి వెళ్ళాడు. ఆమందిరంలో ప్రతి సీటు దగ్గిర లాంతరును పెట్టుకొనే ఒక ప్రత్యేక స్థలం ఉన్నట్లు గమనించేడు. సంఘసభ్యులు వచ్చేకొలది ఆమందిరం ప్రకాశమాన మయ్యింది.

నీవు ఆరాధనకు హాజరు కానప్పుడు నీస్థానంలో నీవు లేనప్పుడు మందిరంలో చీకటిగాయుండునని నీకు తెలుసా? నీ వెలుగు ఆదివారపు ఉదయారాధనలోనే కాదు ప్రత్యేకంగా రాత్రివేళ జరిగే కూటా లలో అత్యవసరం!!

---

## ఉ ప వా స కూ ట ము లు

ఇశ్రాయేలీయులు, శాస్త్రిలు, పరిసయ్యులు ఉపవాసమును గొప్ప అతిశయముతో ఆచరించినను వ్యర్థులైరి. (యెష 58:3-5; జెక 7:5; లూకా 18:9-14). వారు క్రీస్తు శిష్యులు ఉపవసించుటలేదని నిందించిరి. అందుకు క్రీస్తు పాత చట్టమునకు క్రొత్తచట్టము మాసిక వేయకూడదని చెప్పెను (మార్కు 2:18-22). అయినను ఉపవాసము చేయు క్రమపద్ధతినిగూర్చి ఆయన బోధించెను. మత్తయి 6:16-18 చదివి సత్యమును గ్రహించుదము. ఏలయనగా నేటిదినములలో కొన్ని శాఖలవారు ఉపవాస కూటములను పేరుతో సాతాను పద్ధతిననుసరించి ప్రజలను దారితప్పించుచున్నారు.

**క్రీస్తు బోధ:** మీరు ఉపవాసము చేయునపుడు వేషధారుల వలె దుఃఖ ముఖులై యుండకుడి (మత్తయి 6:16).

**నేటి ఉపవాస కూటములు:** ఏడ్పు, గోల, గొప్పశబ్దముతో ప్రలాపించుట.

క్రీస్తు బోధ :—ఉపవసించువారు ముఖములను వికారము చేసికొనుట వేషధారణయే.

నేటి ఉపవాస కూటములు :—ముఖములను వికారము చేసికొని నీరస ముగా మనుష్యులకు కనబడుచుందురు.

క్రీస్తు బోధ :—రహస్యమందున్న తండ్రికి మాత్రము కనబడు నిమిత్తము రహస్యముగా ఉపవసించవలెను (మత్తయి 6 : 6, 18).

నేటి ఉపవాస కూటములు :—పత్రికలద్వారాను, వ్యక్తిగతముగాను గ్రామ గ్రామాలలో ప్రకటించుచూ ఉపవాసం చేయుచున్నారు.

ఈ రీతిగా క్రీస్తు బోధకు విరోధముగా జరిగించుచున్న నేటి "ఉపవాస కూటముల" వలన దేవుని ఆశీర్వాదము ఎట్లు పొందగలరు? నేను చెప్పు మాటలు ప్రకారము చేయక ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచుట యెందుకు? (లూకా 6:46). "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపని వాడు" (2 యోహాను :9).

కొందరు కుంటి, గుడ్డి, కుష్టు మొదలైన రోగులను తమ ఉపవాస కూటములకు ఆహ్వానించి ప్రార్థింతురు. భాషలు, ప్రవచనములు, దర్శనములు కలిగి ఉన్నట్లు నటింతురు. కేకలు, గంతులు, గోల, క్రింద పడి దొర్లుట, వణకుట కనపరచుదురు. గాని ఒక్క స్వస్థతయైనను జరుగదు. అయినను వారు అబద్ధ సాక్ష్యాలతో ప్రజలను మోసగించుచున్నారు. పరిశుద్ధాత్మ అను పేరుతో, భ్రమపెట్టు ఆత్మను కలిగి, సాతాను బలమువలన దయ్యములబోధ (2 థెస్స 2:9-12; 1 తిమోతి 4:1-2) చేయుచు క్రీస్తు సువార్తను చెరుపుచున్నారు (గల 1:6-9). అయితే సువార్త సత్యము ఉన్నది ఉన్నట్లు తెలిసికొనుటకు మీకు సమీపముగా యున్న క్రీస్తు సంఘమును దర్శించండి.

—పాల్ కూటం, గొల్లపల్లి.

## సాతాను చెప్పు వదంతులు

సాతానుడు బైబిలు చరిత్రలో కనిపించు కొందరు భక్తిపరులను పరిపరి విధములుగా శోధించి, చివరికి తానే ఓడిపోవుట గమనింప వచ్చును. అటువంటి శోధనలను సహించి జయించువారికి దేవుని రాజ్యమును దక్కించుకొను అవకాశము మెండుగా కలదు.

### హవ్వతో సాతానుడు జరిపిన సంభాషణ :

అది ఆ స్త్రీతో - ఇదినిజమా? ఈతోట చెట్లలో దేని ఫలము నైనా మీరు తినకూడదని దేవుడు చెప్పెనా యని యనెను. (ఆది 3:1). దేవుడు విధించిన కట్టడను అబద్ధముగా మలిచి, అబద్ధమును చెప్పి చివరికి వారు ఆపండు తినునట్లుగా ప్రేరేపించినది. వారు పాపములో పడి దేవునికి దూరస్థులైరి. హవ్వ సాతాను మాటలను కొంచెమైనను మనస్సున ఆలోచించక గుడ్డిగా నమ్మినది. గాని మనము ఈనాడు అపవాది తంత్రములెరుగుట, వాటికి దూరముగా నుండుట ఎంతయో శ్రేయస్కరము. (ఎఫెసీ 6:11). మరల సాతాను-"మీరు చావనే చావరు" అని ఆస్త్రీతో పలికెను. దేవుని మాటకు విరుద్ధముగా మను ష్యులను వక్రమార్గములోనికి నడిపించుటయే వానిపని. ఎందుకనిన ఆది నుండి వాడు అబద్ధికుడై యుండి, అబద్ధమునకు జనకుడునై యున్నాడు (యోహాను 8:44). మీరు చావనే చావరు, తినుడి అను సాతానుని మాటలలో విశ్వాస భ్రష్టత్వము, అనుభవము అను అబద్ధసిద్ధాంతము కానగును. కాని విశ్వాస భ్రష్టత్వము సంభవమని పరిశుద్ధాత్ముని మాటలు తెలుపుచున్నవి.

### యోబును శోధించిన విధము

దేవదూతలతో ఒక దినమును అపవాది కూడ కలసివచ్చి నప్పుడు (యోబు 1:6), నీవెక్కడ నుండి వచ్చితివని దేవుడడిగిన ప్రశ్నకు జవాబుగా - సాతాను, భూమిమీద అటు యిటూ తిరుగులాడుతూ

సంచరించుచూ వచ్చితి ననెను (యోబు 1:7). నిజానికి భూమిమీద యోబువలె యథార్థపరుడు, నీతిమంతుడు, దైవభయము గలవాడు ఎవ్వడునూ లేడు అని సాతానునికి ఆయన తెలియ జేసెను. అప్పుడు సాతాను "యోబు ఊరకయే, దేవునియందు భయభక్తులు గలవాడాయెనా?" అనెను. యోబుకు దేవు డనుగ్రహించిన ధన సమృద్ధిని తొలగించిన మరుక్షణమే, అతడు దేవుని తృణీకరించి విడిచి పోవునని అపవాది భావించెను (యోబు 1 : 9-11). కాని యోబు అలాంటి మన స్తత్వము గలవాడు కాదని మన మెరుగుదుము. ఎట్లనగా యెహోవాయే యిచ్చెను, యెహోవాయే తీసుకొనిపోయెను. యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక అని అంతట మహా విపత్కర పరిస్థితులలో అతడు పలుకగలిగెను. ఈరోజులలో సమృద్ధిని మాత్రమే కాంక్షించి సేవచేయు నెపముతో పరుగెత్తువారు కలరు. అటువంటి సేవ దైవచిత్తమును బడసినదని తలంచగలమా? అట్లు కానేకాదు. హృదయపూర్వకముగా దేవునికి సమర్పించుకొనక, మనుష్యులను మెప్పించు దృక్పథముతో సేవ చేయువారు, సాతాను సవాలుచేసిన మరుక్షణమే దానికి లోబడి, దాని మాటలనే లక్ష్యపెట్టుదురు. నీవు చేయిచాపి ఎముకను అతని దేహమును మొత్తిన యెడల నీ ముఖము యెదుటనే దూషించి, పోవునని సాతాను మరల హెచ్చరించినది. అయిననూ యోబు దేవునిని దూషించిన వాడుకాడు. విడిచిపెట్టనైన విడిచిపెట్టలేదు (యోబు 2:4, 5). ఎందుకనిన ఈలోక జీవిత సౌఖ్యము కంటే ఆత్మ ప్రాముఖ్య మను సంగతిని యోబుకు ప్రస్ఫుటముగా తెలియును (మత్తయి 10:28).

## యేసును సాతాను శోధించుట

మొదటగా "నీవు దేవుని కుమారుడవయితే, ఈ రాళ్లు రొట్టెలగునట్లుగా ఆజ్ఞాపించుము" అనెను (మత్త 3:4). రెండవది "నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము" అనెను (మత్త 4:6).

ఈవచనము పాత నిబంధనలో నుండి అది ఎత్తి చూపించెను. తరువాత “నీవు సాగిలపడి నమస్కారము చేసిన యెడలవీటన్నిటిని నీ కిచ్చెదనని” అనెను (మత్తయి 4:9). సాతానుడు ప్రభువునే వంచించి, తన వలలో వేసుకొనవలెనని తలంచెను. ఈ నాడును సాతానుడు మనుష్యులను మాయచేసి, ఎన్నింటినో వారిముందు ఎరగా చూపించి, వారి ఆత్మ నాశనము గావించుట జరుగుచునే యున్నది. సాతాను తంత్రిగొట్టు, మోసగాడు. అపవాదిని ఎదురించుడి, అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవును (యాకోబు 4 : 7). మనము సహింపగలిగినంతకంటే ఎక్కువగా ఆయన మనలను శోధింపనియ్యడు. అంతేగాదు, సహింపగలుగుటకు శోధనతోకూడ తప్పించుకొను మార్గమును ఏర్పాటు చేయును (1 కొరింథీ 10:13). సాతాను వదంతులను ఏమాత్రము లక్ష్యపెట్టక, విశ్వాస జీవితములో కొనసాగిపోవుట మన కర్తవ్యము.

—A. సత్యవర్ధనరావు, కాకినాడ.

## కీర్తన పుస్తకములు

మీకుటుంబ, సంఘారాధనలలో చక్కగా పాటలు పాడి దేవుని స్తుతించుటకు వీలుగా యుండుటకు ఒక చక్కని కీర్తనల పుస్తకము తయారు చేయబడినది. దానిలో 231 పాత క్రొత్త కీర్తనలు పొందు పరుపబడి చక్కగా బైండింగ్ చేయబడినది.

ఫుల్ క్లాత్ బైండింగ్ పుస్తకము ఖరీదు రూ. 5-50

సగంక్లాత్ బైండింగ్ పుస్తకము ఖరీదు రూ. 4-00

పోస్టేజి అదనం. కీర్తనల పుస్తకములను V.P.P. ద్వారాకూడా పొందవచ్చును. వలయువారు ఈ దిగువ చిరునామాకు ఈనాడే వ్రాయండి.

**SATYA VANI**
Seshagiri Rao Street,
Ramaraopet, KAKINADA-533 004.

# జీవవాక్కు

లవణసారంబు నీవాక్య - లక్షణంబు
వెలుగు నాతోర్వకది మంచి - వెలుగు దేవ!
నిలిచి జీవింతు నీవాక్య - నీడలోన
ఉప్పు, వెలుగైన ఓ యేసు! - ఉర్విలోన.

దివ్యమైనట్టి నీవాక్య - దీపమె కళిక
యౌవనస్థుల పాలిటి - యోగఫలము
చదువు నెవ్వడో నీవాక్య - సారమెల్ల
నడత మారి నీ మార్గాన - నడువగలడు.

యౌవ్వనాశల నాశించి - యవనులంత
ఆత్మ చింతన కావంత - నాశనీక
చిక్కుకున్నారు సైతాను - చిక్కమందు
చక్క దిద్దుము వారిని - చరచివీపు.

వాక్యమైన ఓ యేసు! నీ - వాక్కు వినగ
వీను లొసంగు యవనులకు - వేడ్క మీర,
సత్వరంబుగ నీ వెంట - సాగి నడువ
శక్తి యుక్తుల నిమ్ము నీ - శక్తిజూపి.

యువతి, యువకులంత - యవన కాలమునందే
ఎఱుగవలెను నిన్ను - యేసుదేవ!
"జీవవాక్కు" చదివి - జీవింప నీయందు
తేట తెల్లమైన - తెలివినిమ్ము.

—వల్తాటి జోసెఫ్.

# క్రైస్తవ్యం అంటే....?

*( Christianity is...)*

క్రైస్తవ్యము అంటే అరణ్యములో ఒక కేక కాదుగాని ఈ లోకంలో ఒక జీవితం. అది గాలిలో ఒక భావన కాదు గాని భూమి మీద దేవుని మార్గాన పోవు పాదములు. అది సీసాక్రింద పెట్టుకొనే ఓ విదేశీ వస్తువేమీ కాదు గాని అన్ని రకములైన వాతావరణముల లోను, పండ్రెండు నెలలలోను ఫలములను ఫలించే వృక్షం. కర్తవ్య నిర్వహణలో నమ్మకమే దాని వేర్లు, కొమ్మలు. మనము ప్రభువు కేమి చెప్పినను, ఆయనను ఎంత ప్రీతికరమైన పదములతో మనం పిలిచినను ఆయన చిత్తమును జరిగించు స్థానాన్ని అవి ఆక్రమించలేవు. ఆయన రాజ్యములో ఆయనతోకూడ రొట్టెను భుజించుటలో గల మాధుర్యాన్ని గూర్చి మనము ప్రకటించ వచ్చునేమోగాని, ఇప్పుడు ఇక్కడ ఆయన రాజ్యములో మనం దున్ని, విత్తనాలు నాటకపోతే అదంతయు గాలిలోపోసిన పన్నీరే. ఆయనను ఆయన బల్లవద్ద జ్ఞాపకముంచుకొని మన బల్లవద్ద మరచిపోవడం గొప్ప వేషధారణయే. ఆయన చిత్తాన్ని జరిగించుచు మేలు చేయుచు సంచరించుటకంటె మరొకటి మనకు లేదు.

—బాబ్ కాక్.

---

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA-533 001

Printed Book only

To

..............................
..............................
..............................
..............................